క్లుప్తంగా

మఠంపల్లి ఎస్‌ఐగా పి.బాబు బాధ్యతల స్వీకరణ



మఠంపల్లి : మఠంపల్లి ఎస్‌ఐగా పి.బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన రామాంజనేయులు పలు అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు. దీంతో నల్లగొండ డీటీసీలో ఉన్న బాబును మఠంపల్లి ఎస్‌ఐగా నియమించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, అప్పారావు

చిలుకూరు : తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, మాజీ సర్పంచ్ కస్తూరి అంజయ్య వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు టీచర్ కస్తూరి అప్పారావు బుధవారం చిలుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఏడీఏ రవి

మఠంపల్లి : మండలంలో యాసంగి సాగుకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని హుజూర్‌నగర్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) రవి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి బొలిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు శ్రావ్యాంజలి, రమ్య, సునీత, దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న దాత

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన నల్లగొండ లయన్స్ క్లబ్ మెంబర్ ఎక్కాల చంద్రశేఖర్ బుధవారం స్థానికంగా 43 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాడి నాగేంద్రమ్మ, మాతంగి జోజి, మేడి సామేలు, నాయుడు అంజి, ఎండీ అక్బర్, పి.జానయ్య, నాగేశ్వరరావు, షేక్ నన్నేసా, పి.నరసింహారావు, చక్రవర్తి, గాలీబ్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ఈ నెల 14న కోదాడ కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నడిగూడెం పోలీస్ స్టేషన్ ఆవరణలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, తదితర కేసులు నమోదైన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి తమ కేసులను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

కల్యాణ మండపం నిర్మాణానికి సిమెంట్ బస్తాల వితరణ

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా కల్యాణ మండపం నిర్మాణానికి బుధవారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు వల్లెపు శ్రీనివాస్, శ్రావణి దంపతులు 50 సిమెంట్ బస్తాలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భవిరిశెట్టి వెంకటరత్నం, కార్యదర్శి కొండా వెంకన్న, కోశాధికారి వందనపు సూర్యప్రకాష్‌రావు, భోనగిరి ఉపేందర్, దయాకర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో 9, 10 వార్డుల ప్రజలు గత పది రోజులుగా తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తాగు నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కాల్వ శ్రీనివాసరావు, పాదిల కొండలు బుధవారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు.

పరీక్ష ఏదైనా.. ప్రతిభ కనబరుస్తూ

- టాలెంట్ టెస్టుల్లో టాపర్లుగా నిలుస్తున్న చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు
- ఎన్‌ఎంఎంఎస్‌కు పదేళ్లలో 100 మంది ఎంపిక
- చెకుముకి, జీవశాస్త్రం, గణిత ప్రతిభా పరీక్షల్లో హవా
- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఇంగ్లిష్ మీడియంలోనూ విద్యార్థుల సత్తా



చెకుముకి టాలెంట్ టెస్టులో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

చిలుకూరు : పోటీ పరీక్ష ఏదైనా అన్నింటా ప్రతిభ కనబరుస్తూ టాపర్స్‌గా నిలుస్తున్నారు చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లిష్ మీడియంలో సైతం సత్తా చాటుతున్నారు. ఒకప్పుడు పదవ తరగతిలో అధిక శాతం ఫెయిల్‌ను చూసిన ఈ పాఠశాల ప్రస్తుతం మంచి విద్యనందిస్తూ ఉత్తమ పాఠశాలగా ఆదర్శంగా నిలుస్తోంది. 15 ఏళ్ల క్రితం పదవ తరగతిలో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ కావడంతో ఆగ్రహంతో గ్రామస్తులే పాఠశాలకు తాళం కూడా వేశారు. ఉపాధ్యాయుల మధ్య అంతర్గత గొడవలతో విద్యార్థులకు సరైన విద్య అందలేదని గ్రామస్తులు ఆరోపణలు చేశారు. ఆ తర్వాత ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన చలసాని శేఖర్ పాఠశాలను సమర్థవంతంగా నిర్వహించి గాడిన పెట్టారు. అదే స్థాయిలో పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు చేస్తున్న ఎ.కరుణాకర్‌రెడ్డి కృషి, ఉపాధ్యాయుల అంకితభావంతో నేడు ఆ పాఠశాల విద్యార్థులు పోటీ పరీక్షలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో రాణిస్తున్నారు. సెలవు రోజుల్లో సైతం ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పదవ తరగతి విద్యార్థులకు గణితం, సైన్స్ సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు ఉపాధ్యాయులు. 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ప్రతి ఏడాది పది మంది ఎంపిక..

కాగా, ప్రభుత్వం ఇటీవల నిర్వహిస్తున్న వరుస టాలెంట్ టెస్టుల్లో చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులే టాపర్స్‌గా నిలుస్తున్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో మండల టాపర్స్‌గా నిలిచారు. పది రోజుల క్రితం నిర్వహించిన గణితం టాలెంట్ టెస్టులో, రెండు రోజుల క్రితం నిర్వహించిన జీవ శాస్త్రం మండల స్థాయి టాలెంట్ టెస్టులో కూడా మండల టాపర్స్‌గా నిలిచి సత్తా చాటారు. ఇక ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో దాదాపుగా ఈ పదేళ్లలో 100 మందికి పైగా విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో ఏ పాఠశాల నుంచి లేని విధంగా ఈ పాఠశాల నుంచి ప్రతి ఏడాది 10 మంది విద్యార్థులు ఎంపిక అవుతున్నారు.

ఉపాధ్యాయుల సమష్టి కృషితో..



ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తుండడం, సమిష్టి కృషితో ప్రతి టాలెంట్ టెస్టులో మా పాఠశాల విద్యార్థులు టాపర్లుగా నిలుస్తున్నారు. ప్రతి ఏడాది 10 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక అవుతున్నారు. గ్రామస్తుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– ఏ. కరుణాకర్‌రెడ్డి, గెజిటెట్ ప్రధానోపాధ్యాయుడు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్డీఓ సూర్యనారాయణ



చిలుకూరులో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

చిలుకూరు : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. బుధవారం చిలుకూరులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వేను నిబంధనల ప్రకారం, కేటాయించిన గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. ఇళ్లు లేని లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, పంచాయతీ కార్యదర్శి షరీఫ్‌వుద్దీన్, బిల్ కలెక్టర్ ధర్మయ్యగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర వివరాలు నమోదు చేయాలి

మునగాల : ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వివరాలను సమగ్రంగా సేకరించాలని ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని నారాయణగూడెం, కృష్ణానగర్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ రమేష్‌దీన్‌దయాళ్, కార్యదర్శులు రజిత, సైదులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

నడిగూడెం : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం కోదాడ ఆర్డీఓ సీహెచ్.సూర్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ఈ నెల 25 లోపు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, ఆంజనేయులు ఎంపీఓ విజయలక్ష్మి, సర్వే సిబ్బంది వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



మఠంపల్లి : భీల్యానాయక్‌తండాలో సర్వే చేస్తున్న కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది

సర్వే ప్రారంభం

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండాలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఇంటింటికీ వెళ్లి పరిశీలించి వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



కోదాడరూరల్ : సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్

కోదాడరూరల్ : విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం పొందుతూ గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని మున్సిపల్ కమిషనర్ రమాదేవి, వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మున్సిపాలిటీ స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు చదువుకే పరిమితం కాకుండా తమకు ఇష్టమైన రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సలీంషరీఫ్, ఎంపీడీఓ రాంచందర్‌రావు, ఎంపీఓ పాండురంగన్న, కౌన్సిలర్లు లంకెల రమానిరంజన్‌రెడ్డి, మధార్, కోటిరెడ్డి, యాదగిరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం నిర్వహించడం అభినందనీయం



మునగాల : అన్నదానం చేస్తున్న దాతలు



కోదాడరూరల్: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మునగాల : అనాథలకు అన్నదానం చేయడం అభినందనీయమని రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య అన్నారు. సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు రాంబాబు–రజని దంపతుల మనవడు పావన వినంద్ జన్మదినం సందర్భంగా బుధవారం మండలంలోని ముకుందాపురం శివారులో గల ఇందిరా అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సంఘం నాయకులు నాగిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, హమీద్‌ఖాన్, విద్యాసాగర్‌రావు, రఘువరప్రసాద్, గడ్డం నర్సయ్య, వెంకటేశ్వరరావు ఉన్నారు.

అయ్యప్ప సన్నిధానంలో అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో బుధవారం రిటైర్డ్ లెక్చరర్ మరాల రఘురామయ్య అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 400 మంది మాలధారులు పాల్గొన్నారు. నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

హుజూర్‌నగర్ : పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని శ్రీచైతన్య టెక్నో స్కూల్ డీజీఎం సుధాకర్, కోఆర్డినేటర్ నాగేందర్, ఆర్‌ఐ సుజిత అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని స్కూల్‌లో పదవ తరగతి పరీక్షలో పది పాయింట్స్ సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులతో కలిపి బుధవారం సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఆ విద్యార్థులకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



జిల్లా స్థాయికి ఎంపికైన నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు

నడిగూడెం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు, జూనియర్ కళాశాల అధ్యాపకులు షేక్.జాన్ పాషా, డి.శ్రీనివాసరావు, నాగరాజు, వ్యాయామ అధ్యాపకురాలు సునీత జిల్లా స్థాయికి ఎంపికైన జట్టును అభినందించారు.

విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మాజీ సర్పంచ్, గ్రామస్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో 21 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం నిర్మాణానికి మాజీ సర్పంచ్ రాధికాఅరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, కార్యదర్శి గిరిజాకుమారి, మంత్రిప్రగడ శ్రీలతఅప్పారావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, నర్సింహారావు, భిక్షం, లింగయ్య, గోపి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య



డీఏఓ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు

హుజూర్‌నగర్ : జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య అని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు కోలా నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లో న్యూస్ కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఐజేయూ పిలుపు మేరకు హుజూర్‌నగర్‌లో ఆర్డీఓ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీఏఓ రాజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు దేవరం రాంరెడ్డి, బి.శ్రీనివాసచారి, రావుల రాజు, దొంతగాని రాజా రమేష్, ఇందిరాల రామకృష్ణ, ఆత్మూరి వెంకటేష్, పిల్లలమర్రి శ్రీనివాసరావు, దేవరం వెంకటరెడ్డి, కితా సుధాకర్, కోమరాజు అంజయ్య, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతుల సమ్మేళనమే భారతదేశం



బతుకమ్మతో విద్యార్థులు, ఉపాధ్యాయినులు

హుజూర్‌నగర్ : వివిధ భాషలు, విభిన్న సంస్కృతుల సమ్మేళనమే భారతదేశం అని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కె.శైలజ, తెలుగు ఉపాధ్యాయినులు ఎస్.కమల, టి.విజయలక్ష్మి అన్నారు. బహుభాషవేత్త, ప్రముఖ తమిళ కవి, రచయిత, పత్రికా సంపాదకులు సుబ్రహ్మణ్య భారతి జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో భారతీయ భాషోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భాష ద్వారా ఐక్యత అనే అంశం, సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను విద్యార్థినులకు వివరించారు. గీతా జయంతిని పురస్కరించుకుని భగవత్ గీత శ్లోకాలు పఠించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని రాంనగర్ బందం వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును వేరే చోటుకు తరలించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డుతో ఈదులగూడ, రాంనగర్ బందం, బాదలాపురం, అవంతీపురం, గూడూరు, కిష్టాపురం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో డంపింగ్ యార్డ్‌లో తడి, పొడి చెత్తను వేరు వేసి వర్మి కంపోస్టు తయారు చేసేవారని, నేడు వ్యర్థాలన్నింటినీ కాల్చి వేస్తుండటంతో వస్తున్న పొగ ప్రజలను రోగాల బారిన పడేలా చేస్తోందన్నారు. డంపింగ్ యార్డ్‌ను వేరే చోటుకు తరలించేందుకు అధికారులు, పాలకులు చర్యలు తీసుకోకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు మల్లు గౌతంరెడ్డి, వాడపల్లి రమేష్, పధాని శ్రీను, తదితరులున్నారు.

కుల గణన ఆధారంగానే ఎన్నికలు నిర్వహించాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వం చేపట్టిన కులగణన ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి ధనుంజయనాయుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కులగణన తర్వాత ఆయా కులాల జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు.

మాల ఉప కులాలకు న్యాయం చేయాలి



ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాబూరావు, పున్నమ్మ

హుజూర్‌నగర్ : ఎస్సీ మాల ఉప కులాలకు న్యాయం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ దగ్గుబాటి బాబూరావు, మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు గాజుల పున్నమ్మ కోరారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దని బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ అక్తర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్, రంజిత్, దసరా, రవి, వినోద్, ప్రవీన్ రాజా, వెంకన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

అర్వపల్లి : గురుకుల విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఈ ఏడాదిలోనే రాష్ట్ర వ్యాప్తంగా 42మంది వివిధ కారణాలతో చనిపోవడం బాధాకరమన్నారు. కాసర్లపహాడ్‌లో ఎస్సీ బాలికల గురుకుల విద్యాలయానికి సొంత భవనం కోసం ఏడేళ్ల క్రితం స్థలం సేకరించినా ఇంతవరకు సొంత భవనం నిర్మించకపోవడం శోచనీయమన్నారు. ఇక్కడ భవనం లేక ఈ విద్యాలయాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు, దీంతో బాలికలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ సుందర్‌రావు

చిలుకూరు : మండల కేంద్రంలోని జేజే నగర్‌లో గల బీసీఎం చర్చిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్ సుందర్‌రావు కేక్ కట్ చేశారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు రాజ్యాంగ విరుద్ధం



వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి

మిర్యాలగూడ టౌన్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ బుధవారం నల్లగొండ కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ విరుద్ధమని, దీనిని మాలమహానాడు వ్యతిరేకిస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా 1267 కులాలను ఒకే జాబితాలోకి చేర్చి రిజర్వేషన్లు కల్పించారని, స్వాతంత్య్రం వచ్చి 77 ఏళ్లు గడిచినా ఎస్సీలకు కల్పించిన 15శాతం రిజర్వేషన్ మాత్రం అమలు కావడం లేదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొప్పాని నగేష్, దేవరకొండ డివిజన్ అధ్యక్షులు యేకుల సురేష్, గాజుల పున్నమ్మ, డాక్టర్ ఏకుల రాజారావు, బాలకృష్ణ, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగకరం

సూర్యాపేటటౌన్ : విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి దేవరశెట్టి జనార్దన్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్‌కెఎల్‌కె బీఈడీ కళాశాలలో దశరథ మెమోరియల్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో తెలంగాణ గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గణిత ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను వెలికితీసుకోవాలన్నారు. అనంతరం విజేతలను అభినందించారు. అదే విధంగా జిల్లా స్థాయి గణిత ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ ఎర్రంశెట్టి రాంబాబు, ఎంఈఓలు శ్రీనివాస్‌గౌడ్, రవి, గణిత ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు, దశరథ మెమోరియల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్‌కుమార్, తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎం.అశోక్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని చిల్లాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రథమ స్థానం ఇస్తుందన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొత్తం ఓటర్లు 32007

- స్త్రీలు 16,469, పురుషులు 15538
- గ్రామ పంచాయతీల ఓటరు తుది జాబితా విడుదల
- సర్పంచ్ ఎన్నికల నిర్వహణకూ సిద్ధం
- గ్రామాల్లో మొదలైన సందడి
- నోటిఫికేషన్ కోసం ఎదురుచూపు



గుడిబండ గ్రామపంచాయతీ కార్యాలయం

కోదాడరూరల్ : జనవరి, ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని ప్రజలంతా భావిస్తున్నారు. అధికారులు సైతం ఎన్నికల నిర్వహణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటికే ఓటర్ల తుది జాబితా, వార్డుల విభజన ప్రక్రియను పూర్తి చేశారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో మొత్తం 158 వార్డులు ఉండగా మొత్తం ఓటర్లు 32007 మంది ఉన్నట్లు తేల్చారు. వారిలో ఎక్కువగా స్త్రీలు 16,469 మంది ఓటర్లు కాగా పురుషులు 15538 మంది ఉన్నట్లు వెల్లడించారు. ఇక గ్రామ పంచాయతీల్లోనూ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్ బరిలో నిలవాలనే ఆయా పార్టీల ఆశావహులు ఓటర్లను ప్రసన్నం చేసుకొనే పనుల్లో పడ్డారు.

అతిపెద్ద పంచాయతీగా కాపుగల్లు..

మండలంలో అతిపెద్ద గ్రామపంచాయతీగా కాపుగల్లు ఉంది. కాపుగల్లులో 4325 మంది ఓటర్లు ఉండగా స్త్రీలు 2192, పురుషులు 2133 మంది ఉన్నారు. 561 మంది ఓటర్లతో కూచిపూడితండా చిన్న గ్రామ పంచాయతీగా ఉంది. ఇక గుడిబండలో 3795 ఓటర్లు ఉండగా వారిలో స్త్రీలు 1982, పురుషులు 1813 మంది ఉన్నారు. గణపవరంలో మొత్తం ఓటర్లు 3649 మంది ఓటర్లు ఉండగా స్త్రీలు 1862, పురుషులు 171787 మంది, దోరకుంటలో 2956 మంది ఓటర్లు ఉండగా వారిలో స్త్రీలు 1535, పురుషులు 1421 మంది ఉన్నారు. తొగర్రాయిలో మొత్తం ఓటర్లు 2611 మంది ఉండగా వారిలో స్త్రీలు 1348, పురుషులు 1263 మంది, నల్లబండగూడెంలో మొత్తం ఓటర్లు 2601 మంది ఉండగా వారిలో స్త్రీలు 1303, పురుషులు 1298 మంది ఉన్నారు. కూచిపూడిలో 2103 మంది ఓటర్లు ఉండగా వారిలో స్త్రీలు 1077, పురుషులు 1026 మంది, రెడ్లకుంటలో మొత్తం ఓటర్లు 1945 మంది ఉండగా స్త్రీలు 1025, పురుషులు 920 మంది, చిమిర్యాలలో 1679 మంది ఓటర్లు ఉండగా వారిలో స్త్రీలు 897, పరుషులు 782 మంది, బీక్యాతండాలో 1097 మంది ఓటర్లు ఉండగా స్త్రీలు 547, పురుషులు 550 మంది ఉన్నారు. రామలక్ష్మీపురంలో 986 మంది ఓటర్లు ఉండగా వారిలో స్త్రీలు 509, పురుషులు 477 మంది, అల్వాలపురంలో 846 మంది ఉండగా వారిలో స్త్రీలు 439 మంది, పురుషులు 407 మంది, మంగళితండాలో మొత్తం ఓటర్లు 836 మంది ఉండగా వారిలో స్త్రీలు 439, పురుషులు 397 మంది, అడ్లూరులో మొత్తం ఓటర్లు 772 ఉండగా స్త్రీలు 388, పురుషులు 384 మంది ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం



గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఎప్పుడొచ్చిన నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేసి పంచాయతీలకు పంపించాం. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల కోసం వేచి చూస్తున్నాం.

– రాంచందర్‌రావు, ఎంపీడీఓ, కోదాడ